క్లుప్తంగా

నేడు ఆరాధనోత్సవాలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధాన ఉత్సవాలను నిర్వహించనున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కండివెండి నర్సింహాచారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆరాధన హారతి, అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాత్రి ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

రేపు లక్కీడిప్ ద్వారా ఎంపిక

ములుగు రూరల్: ములుగు మండలంలోని దేవగిరిపట్నం మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలకు లక్కీడిప్ ద్వారా రేపు (గురువారం) ఎంపిక చేయనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల 30 నిమిషాలకు నాన్ మైనారిటీ విద్యార్థులు విభాగంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ , ఓసీ విద్యార్థులను తల్లిదండ్రుల సమక్షంలో డ్రా పద్ధతిన ఎంపిక చేస్తామని అన్నారు. విద్యార్థినులు తల్లిదండ్రులు సకాలంలో హాజరుకావాలని అన్నారు. ఎంపిక ప్రక్రియకు డీఎండబ్ల్యూఓ రవీందర్, ఆర్ఎల్సీ రమేష్, ఉమ్మడి వరంగల్ జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్ రుహినా హాజరవుతున్నట్లు తెలిపారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

వాజేడు: వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నేడు (బుధవారం) పర్యటించనున్నట్లు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్ల పూడి విక్రాంత్ మంగళవారం ఒక ప్రకనటలో తెలిపారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చెయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

స్థల పరిశీలన

మల్హర్: మండలంలోని మల్లారం దబ్బగట్టు శివారులోని తాటి వనంలో చేపట్టనున్న శ్రీ రేణుక ఎల్లమ్మ గుడి నిర్మాణానికి పరకాల డివిజనల్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ నదంనం కవిత మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గుడి పనులను తర్వగా చేపట్టాలని సూచించారు. దూప దీప, నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, తెలంగాణ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కార్యదర్శి సాంబయ్య, మల్లారం గౌడ సంఘం అధ్యక్షుడు కొట లింగయ్య ఉన్నారు.

కమిటీ ఎన్నిక

కాటారం: కాటారం ఇండోర్ బ్యాట్మింటన్ క్లబ్ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీని మంగళవారం షటీల్ క్రీడాకారులు ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చీర్ల సమ్మిరెడ్డి, కమిటీ సలహాదారులుగా పంతకాని సమ్మయ్య, జోడు శ్రీనివాస్, కోశాధికారులుగా జగన్‌నాయక్, ఆత్మకూరి కుమార్‌యాదవ్, సభ్యులుగా బండి శ్రీనివాస్, రాజయ్య, గడ్డం కొమురయ్య, ఆత్మకూరి కుమార్, కొట్టె ప్రభాకర్, గుడిమే లింగమూర్తి, ఎదులాపురం ప్రవీణ్, గోనె మహేశ్, కురుసం అశోక్, ముక్కెర నాగరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాటారంలో ఇండోర్ బ్యాట్మింటన్ కోర్టుకు నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్‌బాబుకు అడ్‌హక్ కమిటీ సభ్యులు, క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రీతో ప్రత్యేక గుర్తింపు

రేగొండ: భూమి కలిగిన ప్రతీ రైతు తమ వివరాలతో ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకుని ప్రత్యేక గుర్తింపు పొంది ప్రభుత్వం నుంచి లబ్ధిపొందాలని మండల వ్యవసాయాధికారి వాసుదేవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. పీఎం కిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడుత లబ్దిపొందుటకు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన పథకాలు అమలుకు ఫార్మర్ రిజిస్ట్రీకి సంబంధం లేదన్నారు.

శిఖం భూముల కబ్జాపై చర్యలేవి?

- హద్దులు ఏర్పాటు చేయని అధికారులు
- రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల తీరుపై రైతుల ఆగ్రహం


శిఖం భూములను పరిశీలిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు (ఫైల్)

మంగపేట: మండలంలోని బోరునర్సాపురం ఉప్పలినర్సయ్య, మల్లూరు అత్త, కోడలు చెరువు శిఖం భూములకు కబ్జా చేసిన వారిపై సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంపై అంతర్యం ఏమిటని ఆయా చెరువుల ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. కబ్జా కోరులు చెరువుల మత్తడి, శిఖం భూములను పూర్తిగా కబ్జా చేసి సాగు భూములుగా మార్చుకున్నారని వర్షాకాలంలో చెరువుల్లోకి రావడంతో వారి పంటలు మునగకుండా ఉండేందుకు చెరువుల షట్టర్లు ధ్వంసం చేసి సాగు నీటికి ఉపయోగపడే నీటిని బయటకు వెళ్లగొడుతున్నారని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. దీంతో తమ భూములకు సాగునీరందక ప్రతిఏటా తీవ్ర ఇబ్బందులను పడాల్సి వస్తుందని వెంటనే శిఖం భూములకు హద్దులు ఏర్పాటు చేయాలని పలుమార్లు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన ప్రతి సారి చెరువుల్లో నీళ్లు ఉన్నాయని, సర్వేయర్ అందుబాటులో లేరని సాకులు చెపుతూ తప్పించుకుంటున్నారని రైతులు వాపోతున్నారు.

కలెక్టర్ ఆదేశాలిచ్చినా చర్యలు శూన్యం..

మండలంలో చెరువుల శిఖం భూముల కబ్జా విషయంపై స్పందించిన అప్పటి కలెక్టర్ ఇలా త్రిపాఠి 2024 ఏప్రిల్ నెలలో చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులు మండలంలో చెరువుల పరిస్థితిని కలెక్టర్‌కు వివరించారు. మిషన్ కాకతీయ పథకంలో కోట్ల రూపాయలు ఖర్చుచేసి చేసిన మండలంలోని బోరునర్సాపురం, మంగపేట, కమలాపురం తదితర గ్రామాల్లోని చెరువుల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. స్పందించిన కలెక్టర్ శిఖం భూములను కబ్జా చేస్తుంటే ఎంచేస్తున్నారు అంటు రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శిఖం భూములను కబ్జాచేసిన వారిపై పోలీస్ కేసు పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు నామ మాత్రానికే ఉన్నారా అంటు వెంటనే చెరువులలో సర్వే నిర్వహించి శిఖం భూములకు హద్దులు ఏర్పాటు చేసి జేసీబీతో ట్రెంచ్ కొట్టించి వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలన్నారు. కలెక్టర్ ఆదేశించి సంవత్సరం గడుస్తున్నా నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన స్పందించి శిఖం భూములు కబ్జా చేసిన వారిపై చర్య తీసుకోని హద్దులు ఏర్పాటు చేసి చెరువులను కాపాడాలని కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు..



చెరువుల శిఖం భూములను దర్జాగా కబ్జా చేసి బోరుబావులు నిర్మిస్తు సాగుచేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. విషయంపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాం. చెరువును పరిశీలించారు. బోరు బావులను తొలిగించి, శిఖం భూములకు హద్దులు ఏర్పాటు చేస్తామని చెప్పి వెళ్లారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

- నూతులకంటి కృష్ణ, బోరునర్సాపురం రైతు

చర్యలు తీసుకుంటాం..



రైతులు ఫిర్యాదు చేసి నాలుగు రోజులు అవుతోంది. పరిశీలించాలని అధికారులను పంపించా. వారు రైతుల సమక్షంలో పరిశీలించారు. ప్రస్తుతం సర్వేయర్ అందుబాటులో లేదు. ఇరిగేషన్ అధికారులు చెరువుకు సంబంధించిన రికార్డును తీసుకునివస్తామన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహించి శిఖం భూములకు హద్దులను ఏర్పాటు చేసే విధంగా అతి త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

- తోట రవీందర్, తహసీల్దార్, మంగపేట

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత


వాడగూడెంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సోమయ్య

- కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు సోమయ్య

మంగపేట: భారత రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు, జైబాపు జై భీమ్ జై సంవిధాన్ మండల ఇన్‌చార్జ్ గుమ్మడి సోమయ్య అన్నారు. మండలంలోని మల్లూరు, కొత్తమల్లూరు, చుంచుపల్లి, వాడగూడెం, రమణక్కపేట గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి ఆధ్వర్యంలో జైబాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ.. మహనీయుల త్యాగాల వలన మనకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. అనంతరం రాజ్యాంగం కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిబిరాల ఏర్పాటు సంతోషకరం

గోవిందరావుపేట: నిరుపేదలకు ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యాన్ని అందించడం ద్వారా ఎంతో సంతోషంగా ఉందని బీఆర్ఎస్ నియోజకవర్గ జిల్లా నాయకుడు భూక్య జంపన్న అన్నారు. మండల పరిధిలోని బాలాజీ నగర్ గ్రామంలోని ప్రజలకు జంపన్న ఆధ్వర్యంలో డాక్టర్ ప్రశాంత్ నేతృత్వంలో డాక్టర్ల బృందం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో చుట్టూ పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో లకావత్ నరసింహ నాయక్, మల్లేశ్‌గౌడ్, రాజు నాయక్, స్వామి నాయక్, నర్సింగ్, బిక్కు, మిట్టు నాయక్, రవీందర్, సారయ్య, లక్ష్మణ్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

మంగపేట: మండలంలోని నర్సింహాసాగర్ పంచాయతీ పరిధిలోని శనిగకుంట ప్రజల తాగునీటి సమస్య మంగళవారం పరిష్కారమైంది. 535 మంది జనాభా కలిగిన గ్రామంలో దశాబ్ద కాలంగా తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వేసవి కాలంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో గ్రామస్తులు సమస్యను పరిష్కరించాలని మంత్రి సీతక్కను కోరారు. మంత్రి సీతక్క కలెక్టర్‌తో మాట్లాడి రూ.4.75 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులను మంజూరీ చేయించారు. ఆ నిధులతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ యాకన్న, ఎంపీఓ కిశోర్‌తో కలిసి యుద్ధ ప్రతిపాదికన గతంలో ఉన్న బావిలో పూడిక తీయించి బావిలోని నీటిని మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా ఓవర్ హెడ్ ట్యాక్‌కు ఎక్కించారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి


వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

గోవిందరావుపేట: ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ సేవలందిస్తున్న పాత్రికేయులందరికీ ప్రభుత్వం ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని లక్నవరం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బత్తిని వెంకట్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో లక్నవరం ప్రెస్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో తహసీల్దార్ సృజన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. 30 సంవత్సరాల పైబడి మండలంలో విలేకరులుగా కొనసాగుతూ అరకొర పరిస్థితిల్లో జీవితాలను వెళ్లదీస్తున్నామని అన్నారు. కాగా, ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకపోయి అమలుకు కృషి చేస్తానని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సామ బుచ్చి రెడ్డి, పడాల వాసు రెడ్డి, తుక్కాని ఎల్లారెడ్డి, బొల్లోజు యోగేంద్రచారి, గుండెబోయిన అనిల్, కల్లేం రవి, వేముల సతీష్, బానోత్ వెంకన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్ల పంపిణీ


పంపిణీ చేస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని కొండపర్తి గూడెంలోని గొత్తికోయ విద్యార్థులకు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి వాటర్ బాటిళ్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీగూడెంలోని విద్యార్థులను ప్రోత్సాహించేందుకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశామని తెలిపారు. పిల్లలను పనికి పంపించకుండా పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు ఎస్సై కౌన్సిలింగ్ చేశారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ములుగు రూరల్: పీడిత ప్రజల కోసం పాటుపడిన మద్దికాయల ఓంకార్ శత జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి గుంబోయిన చంద్రయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లాకేంద్రంలో ఓంకార్ శత జయంతి వేడుకల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 12న మచ్చాపురం గ్రామంలో నిర్వహించే బహిరంగ సభకు కార్మికులు, కర్షకులు అధిక సఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగిలి సుధాకర్, రాసరాజన్న, చిన్న మల్లయ్య, గంగరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మహిళా ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి స్నేహారెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 83 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం 18 మంది వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు ములుగు ఏరియా వైద్యశాలకు పంపించారు. అనంతరం మండల పరిధిలోని సూరవీడు, నూగూరు, తిప్పాపురం, ఎదిర గ్రామాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వినయ్, పవన్, ఆశీష్, మోహనరావు, సత్యనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

డేంజర్ జోన్ ఇళ్ల వివరాలు సేకరించాలి


మంత్రి శ్రీధర్‌బాబుతో నాయకులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌కు 500 మీటర్ల పరిధిలో ఉన్న పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్ ఇళ్ల వివరాలను సేకరించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు డేంజర్ జోన్ నిర్వాసితులు, కాంగ్రెస్ నాయకులు విన్నవించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబును కలిసి డేంజర్ జోన్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపారు. మంత్రి సానూకులంగా స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, నాయకులు ఇందారపు చంద్రయ్య, మల్క ప్రకాశ్‌రావు, అశోక్‌రావు, ఇందారపు ప్రభాకర్, సురేష్‌రావు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు తాగునీటి సరఫరా


నీటిని అందజేస్తున్న అధికారులు

గోవిందరావుపేట: మండలంలోని కర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బూడిదగడ్డ గుత్తికోయ ఆవాసంలో నివసిస్తున్న గిరిజనులకు గ్రామ పంచాయతీ మండల అధికారి మమత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్ ఆధ్వర్యంలో తాగునీటిని సరఫరా చేశారు. బూడిదగడ్డ గుత్తికోయ గుంపులో నివసిస్తున్న ప్రదేశంలో నీటి సదుపాయాలు లేవు. బోరింగ్ పాయింట్ వేయడానికి కూడా వీలు లేని పరిస్థితి. దీంతో ఎండ కాలంలో నీటి కోసం వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోని వాటర్ క్యాన్‌ల ద్వారా వారికి నీటిని సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో కర్లపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉస్మాన్, గ్రామ ప్రజలు, తదితరలు పాల్గొన్నారు.

ఫారెస్ట్ రోడ్డు పనుల్లో జాప్యం

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు


మాట్లాడుతున్న పుట్ట మధు

మల్హర్: మండలంలోని కిషన్‌రావుపల్లి ఫారెస్ట్ రోడ్డు పనుల్లో జాప్యం ఎందుకని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అన్నారు. మంగళవారం మండలం కిషన్‌రావుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పుట్ట మధు మాట్లాడారు. శ్రీధర్‌బాబు మంత్రిగా ఉండి 16 నెలలు గడుస్తున్నా రోడ్డు పనులు ప్రారంభించలేదని విమర్శించారు. రెండు నెలల క్రితం జీఓ తీసుకువచ్చి నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేశారన్నారు. దీంతో మంత్రికి పాలాభిషేకాలు చేయడంతో పాటు ప్రతిపక్ష పార్టీకి చెంపపెట్టు అంటూ పలువురు నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మల్హర్ మండల ప్రజల చిరకాల స్వప్నం ఖమ్మంపల్లి బ్రిడ్జి నిర్మాణం చేసి మండల ప్రజలకు దూరభారం తగ్గించేలా రహదారుల సౌకర్యాలు కల్పించామన్నారు. బీఆర్ఎస్ జిల్లా నాయకులు జక్కు రాకేశ్, మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, నాయకులు తాజొద్దీన్, యాదగిరిరావు, మండల యూత్ అధ్యక్షుడు జాగరీ హరీశ్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత


సమ్మె నోటీస్ అందజేస్తున్న ఆశవర్కర్లు

వాజేడు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. ఆశ వర్కర్లు ఈ నెల 20 నుంచి సమ్మె చేపడుతున్నారు. ఈ మేరకు వారు మంగళవారం సమ్మె నోటీస్‌ను సీఐటీయూ ఆధ్వర్యంలో వాజేడు పీహెచ్‌సీ వైద్యాధికారికి తరుణ్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల రఘుపతి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందన్నారు. పని గంటలు 8 నుంచి 12 గంటలకు పెంచి కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని తెలిపారు. ఆశవర్కర్లకు కనీస వేతనం అమలు చేసేంతవరకు సమ్మె ఆపేది లేదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాలం శాంత, సరిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై విమర్శలు చేస్తే ఊరుకోం..


మాట్లాడుతున్న రాజబాపు

కాళేశ్వరం: రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుపై బీఆర్ఎస్‌పార్టీ నాయకులు విమర్శలు చేస్తే ఊరుకోం అని మహదేవపూర్ మండల కాంగ్రెస్‌పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాపు తెలిపారు. మంగళవారం కాళేశ్వరంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాళేశ్వరంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్ శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ మతి భ్రమించినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించి, అదే ప్రభుత్వంలో కుంగితే కాంగ్రెస్‌పార్టీపై అనుమానం ఉందనడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు. ఆయన వెంట నాయకులు అరుణ్, నగేష్, రాజబాపు, శ్రీనివాస్ ఉన్నారు.

ఒకరి ఆత్మహత్య

భూపాలపల్లి అర్బన్: ఉరేసుకొని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహాముత్తారం మండలం నర్సింగపూర్‌కు చెందిన గుడికందుల సతీశ్(32) పట్టణంలోని చికెన్‌సెంటర్‌లో పని చేస్తున్నాడని పేర్కొన్నారు. కొద్ది రోజులుగా భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపానికి గురైనట్లు తెలిపారు. పట్టణంలో అద్దెకు ఉంటున్న ఇంట్లోనే ఉరేసుకొని మృతి చెందాడని తెలిపారు. మృతుడి సోదరుడు దేవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు


భీష్మనగర్ శివారులో రోడ్డు పక్కన ఒరిగిన విద్యుత్ స్తంభం


జడల్‌పేట శివారులోని పంట పొలంలో ఒరిగిన స్తంభం

- ఆందోళన చెందుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

చిట్యాల: మండలంలోని పలు గ్రామాల్లోని పంట పొలాలతో పాటు రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను సరి చేయాలని విద్యుత్ అధికారులకు చెప్పిన కనీసం పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని జడలపేట శివారులో రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభం ఒరిగి నెలలు గడుస్తున్న కనీసం సంబంధిత అధికారులు చూసి చూడనట్లుగా వ్యహరిస్తున్నారు. అలాగే బావుసింగ్‌పల్లి, చిట్యాలతో పాటు పలు గ్రామాల శివారుల్లో చాలా విద్యుత్ స్తంభాలు ఒరిగి ఉన్నాయి. అవి ఎప్పుడు గాలివానకు నెలకొరిగిపోతాయోనని రైతులు భయంతో జంకుతున్నారు. జడలపేట ప్రాంతాల్లో పంట చేలలో విద్యుత్ వైర్లు తాకే విధంగా ఉన్నాయి. బలమైన ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు ఒకదానికోకటి తగిలి నిప్పురవ్వలు ఎగసి పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు, తీగలను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

స్తంభాలను సరి చేస్తాం..

రోడ్ల వెంట ఒరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేస్తాం. అలాగే గ్రామ శివారులో ఒంగిన స్తంభాలతో పాటు విద్యుత్ తీగలను సరి చేస్తాం.

- శేఖర్, విద్యుత్ శాఖ ఏఈ, చిట్యాల

చొరబాటుదారులను తిరిగి పంపాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మండలంలోని పరిసర ప్రాంతాల్లో ఎవరైన పాకిస్తాన్, బంగ్లాదేశ్ చొరబాటు దారులు ఉంటే గుర్తించి వారిని తిరిగి పంపాలని బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ లక్ష్మీరాజయ్యకు మండల కేంద్రంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొల్లె సునీల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆదేశించినట్లుగా మండలంలో ఎవరైన చొరబాటు దారులు ఉన్నారా అనే విషయాన్ని అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాధనపలి విజయ్, నోముల శ్రీకిషన్, కోయిల శ్రీను, తోట సతీష్ తదతరులు ఉన్నారు.